సాక్షి చిత్తూరు
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



బోయకొండ..జన దండు

బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. వరలక్ష్మి పూజల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగింది. - 8లో



పకడ్బందీగా జిల్లా జట్ల ఎంపిక

జిల్లా స్థాయి పోటీల్లో జట్ల ఎంపిక పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. - 8లో



చేయూతనిస్తే మరింత అభివృద్ధి

ప్రభుత్వం చేయూతనిస్తే మరింత అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలుస్తామని లబ్ధిదారులు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంజనీరింగ్ ఉద్యోగాలకు 37,121 దరఖాస్తులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలోని 57 ఉద్యోగాలకు సంబంధించి 37,121 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి ప్రశ్న పత్రం ద్వారా పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకోనున్నారు. అదేవిధంగా టీటీడీలోని కీలక విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేసే విషయంలో రెగ్యులర్, తాత్కలిక డెప్యూటేషన్ పద్ధతిపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా నియమించిన కమిటీ సమర్పించిన నివేదిక ద్వారా ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. స్విమ్స్ ఆస్పత్రిలో 128 మంది పారామెడికల్ సిబ్బందితో పాటు రిజిస్ట్రార్, ఇతర విభాగాల అధికారుల నియామకానికి టీటీడీ అధికార యంత్రాంగం నిర్ణయించింది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,144 మంది స్వామివారిని దర్శించుకోగా 28,889 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యుత్ ఏఓగా బాలు




చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా విద్యుత్ ఏఓ (అకౌంట్స్ ఆఫీసర్)గా బాలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అధికారులు, ఉద్యోగులు ఆయనను పరిచయం చేసుకొని మాట్లాడారు. గతంలో చిత్తూరు డివిజన్‌లో జేఏఓగా పనిచేసినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఇంతకు ముందు ఏఓగా ఉన్న ప్రసన్న ఆంజనేయులను ఎస్‌ఏఓగా పదోన్నతి రావడంతో కడపకు బదిలీ అయ్యారు.

రేపు సత్యనారాయణ వ్రతం

కాణిపాకం : పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరదరాజ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతం జరగనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు ఈ వ్రతం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

12న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం : ఈనెల 12న కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో సంకటహర గణపతి వ్రతంను నిర్వహిస్తున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటలకు వరకు వ్రతం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.



చెరువుకు తమ్ముళ్ల చెర

ఆక్రమణకు గురై కుంచించుకు పోయిన చెరువు



చిత్తూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెరువు టీడీపీ నేతల చెరలో చిక్కుకుంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యథేచ్ఛగా భూకబ్జాలు సాగుతున్నాయి. సాగుకు ఉపయోగపడుతున్న చెరువులను అక్రమార్కులు చెరపడుతున్నారు. మట్టి, ఇసుక మాఫియా, రియల్టర్ల దెబ్బకు చెరువులు మాయమవుతున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి దగ్గరలో చెరువు కబ్జా అవుతున్నా ఇరిగేషన్ అధికారులు మీనమేషాలు లెక్కించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో చెరువు ఆక్రమణ
- చదును చేసి ఆక్రమించుకుంటున్న టీడీపీ నేతలు
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే తంతు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

టాస్క్‌ఫోర్స్ : అధికారమే అండ.. సంపాదనే ధ్యేయంగా ప్రకృతి వనరులను దోచుకుంటున్న కూటమి నేతలు ఊరికి ఉపయోగపడే చెరువులనూ వదలడం లేదు. నేడు కోట్ల రూపాయలు విలువ చేసే చెరువు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు సమీపంలోని పెట్రోల్ బంక్‌కు వెనుక వైపు ఉన్న చెరువును ఆక్రమించుకునేందుకు మట్టి తోలి చదునుచేశారు. ఒకటిన్నర ఎకరా చెరువును పూర్తిగా చదును చేసి ఆక్రమించేందుకు స్కెచ్ వేశారు. ఈ ఆక్రమణ విషయంపై పలువురు ప్రజలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే ఆ శాఖ అధికారులు తమకేమి తెలియదన్నట్లు మిన్నుకుండిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

రియల్ ఎస్టేట్ కోసమే చెరువుల ఆక్రమణ

అధికారంలో ఉండే కొంత మంది పెద్దల సహకారంతోనే చెరువుల ఆక్రమణ తతంగం సాగుతోందని ప్రచారం సాగుతోంది. అధికారంలో ఉన్న వారే చెరువులు కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సొమ్ము చేసుకుంటుంటే అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. అంతే తప్ప వాటిని కాపాడే ప్రయత్నం ఏ మాత్రం చేయడం లేదు. నగర సరిహద్దులో ఉన్న చెరువుల ఆక్రమణ పెరిగి కుంచించుకుపోతున్నాయి. వందల ఎకరాల్లో ఉండే పెద్ద పెద్ద చెరువులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి.

ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు

చెరువులు ఆక్రమిస్తున్నా..పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న పచ్చనేతలు ఇష్టానుసారం చెలరేగిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చెరువు గర్భంలో మట్టి వేసేసి సొంతం చేసుకుంటున్నారు. నిబంధనలకు పాతరేస్తూ కబ్జాలకు తెరలేపుతున్నారు. అధికారంలోని ఉన్నది కూటమి ప్రభుత్వం తమను ఎవరేం చేస్తారులే అన్న ధీమాతో దందాలు సాగిస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్‌ఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

కనుమరుగవుతున్న చెరువులు

పర్యావరణం, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు ప్రజల దాహార్తి తీర్చేలా దూరదృష్టితో ఏర్పాటు చేసిన చెరువులు కూటమి నేతల చెరలో పడి కనుమరుగవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా పలు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి రూ.కోట్ల విలువ చేసే చెరువుల భూములు నేడు పెద్ద వ్యాపారంగా మారాయి. దీంతో నగరంలో భూగర్భ జలాలు భవిష్యత్తులో తగ్గిపోయే ప్రమాదం ఉందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే నగర పరిధిలోని చెరువులు కబ్జాకు గురై కొన్నేళ్లల్లో మాయమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

జిల్లా కేంద్రం పరిధిలో కబ్జాకు గురైన చెరువుల వివరాలు ఇలా..

చెరువు పేరు	ఉన్నది (ఎకరాల్లో)	కబ్జా అయ్యింది (ఎకరాల్లో)
తిమ్మసముద్రం కస్తూరినాయునిచెరువు	31.57	2
తేనెబండ కొత్తచెరువు	10.22	4.50
తిమ్మసముద్రం బుద్దేయల చెరువు	16.50	2
తిమ్మసముద్రం కొత్తచెరువు	20.36	1.50
నరిగిపల్లె పెద్దచెరువు	15.45	6.75
77 గాండ్లపల్లె కట్టమంచి చెరువు	54.96	1.50
ఇరువారం జడియం చెరువు	56.4	1.25
మురకంబట్టు అగ్రహారం చెరువు	73.38	4.50
గిరింపేట కుమ్మరవానికుంట	5.40	2.34
గిరింపేట భవానీశంకర్‌చెరువు	28.71	3.74
గిరింపేట గంగినేనిచెరువు	45.43	10
మాపాక్షి పెద్ద చెరువు	36.38	4.16
అనుపల్లె పెద్దచెరువు	14.94	5.10



కలెక్టరేట్‌కు సమీపంలోని పెట్రోల్ బంక్‌కు వెనుక వైపు ఆక్రమణకు గురైన చెరువు

ఆధునికతతో చేనేత పోటీ



ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేనప్పటికీ ఒక తరం నుంచి మరో తరానికి చేనేత నైపుణ్యాలు అందుతూ వచ్చాయని డీఆర్‌వో మోహన్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌వో మాట్లాడుతూ.. భారతదేశంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి చేనేత రంగం ఉపాధి కల్పిస్తోందన్నారు. నేత కార్మికులు కాళ్లు, చేతులు, కళ్లను మగ్గాలపై కేంద్రీకరించి అకుంఠిత దీక్షతో వస్త్రాలను తయారు చేస్తారన్నారు. ఆధునిక కాలంతో చేనేత రంగం పోటీ పడుతోందన్నారు. చేనేత మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య ఉద్యమ భావనలకు, కళాకారుల సృజనాత్మకతకు అలంబనగా నిలిచిందన్నారు. యువత వారానికి ఒకసారి చేనేత వస్త్రాలను ధరిస్తే ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి మెరుగవుతుందన్నారు. చేనేత కార్మికులు ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

'విద్యాశక్తి' వాయిదా వేయండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యాశక్తి కార్యక్రమాన్ని వాయిదా వేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని అధికారులు ఆదేశించడం అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. నూతన కేడర్ స్ట్రెంత్ ప్రకారం టీచర్లకు ఒక పీరియడ్ మాత్రమే లీజర్ దొరుకుతుందన్నారు. రోజంతా నిమిషం తీరక లేకుండా పాఠశాలలో టీచర్లు సతమతమవుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో మరో గంట పాటు అదనంగా తరగతులు నిర్వహించాలని ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదన్నారు. టీచర్లకు విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం చేయాలన్నారు. విద్యార్థులు సైతం పాఠశాల సమయం కాగానే ఆసక్తి లేక ఇళ్లకు వెళ్లేందుకు మక్కువ చూపుతారని తెలిపారు. బలవంతంగా విద్యార్థులను నిర్బంధం చేయడం టీచర్లకు సాధ్యపడదన్నారు. ఈ విద్యాశక్తి కార్యక్రమాన్ని జనవరి నుంచి అమలు చేయాలని, అంత వరకు వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీలంటే చంద్రబాబుకు చులకన!



పూలే విగ్రహానికి వినతి ఇచ్చి నిరసన తెలుపుతున్న చంద్రశేఖర్, జ్ఞానజగదీష్, కుమార్‌రాజా, నాయకులు

చిత్తూరు, కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు , ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి దాష్టీకమని ఆ పార్టీ బీసీ నేతలు ఖండించారు. గురువారం స్థానిక జ్యోతిరావ్ పూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, పాల ఎకరి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రాజా, రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలవలేమని టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. నల్లగొండువారి పల్లెలో కొంత మంది నాయకులను కలవడానికి వెళ్లిన వారిపై వంద మంది టీడీపీ అల్లరిమూకలు దాడి చేయడం బాధాకరమన్నారు. బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఎమ్మెల్సీ నాయకులతో మాట్లాడటానికి వెళ్తే తప్పేమిటన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలో వచ్చినప్పటి నుంచి పాలన ఎలా సాగుతుందో ప్రజలు గమనిస్తున్నారని నగర బీసీ విభాగం అధ్యక్షుడు నారాయణ, జిల్లా బీసీ విభాగ కార్యదర్శి నవీన్ యాదవ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు త్యాగ, జిల్లా బూత్‌కమిటీ ఉపాధ్యక్షుడు రాంగణేష్ నాయకులు శరవణ, చంద్ర, అశోక్, వినోద్. మురళీ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం.. ఉద్యోగులు హడల్

కుప్పం అంటేనే ఉద్యోగులు హడలిపోతున్నారు. సీఎం నియోజకవర్గం అయితే ఇన్ని ఒత్తిళ్లా..మమ్మల్ని వదిలేస్తే వెళ్లిపోతాం అంటూ ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అధికార పార్టీ నేతలు చేస్తున్న ఒత్తిళ్లు తాళలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు.



అమ్మో.. పనిచేయలేం!

- సీఎం ఇలాకలో ఉద్యోగులపై తీవ్ర ఒత్తిళ్లు
- సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారులు
- కుప్పం వచ్చేందుకు ససేమిరా అంటున్న ఉద్యోగులు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు తాళలేకపోతున్న అధికారులు

కుప్పం : ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉన్నతాధికారులు ఓ వైపు.. అధికార పార్టీ నేతలు మరో వైపు చేస్తున్న ఒత్తిళ్లతో కుప్పంలో పనిచేయలేకపోతున్నామని అధికారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కడా కార్యాలయ సిబ్బంది సైతం పేపర్ వర్కులు చేయలేక పోతున్నామని మదన పడుతున్నారు. నిత్యం ప్లానింగ్ , సర్వే, నివేదికలతోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూముల సేకరణతో ఇక్కట్లు

రెవెన్యూశాఖలో భూ సమస్యల పరిష్కరించాలని ఇబ్బందులు పెడుతూ..మరోవైపు పలు పరిశ్రమలకు, సోలార్ ఏర్పాటుకు భూములు సేకరించాలని ఒత్తిళ్లు చేస్తుండడంతో తట్టుకోలేకపోతున్నారు. నియోజకవర్గంలోని రైతులు చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీరి వద్ద నుంచి భూములు సేకరించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. ఎకరా, రెండెకరాలు కలిగిన రైతుల ఆవేదన మనస్సును కలచి వేస్తోంది. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు పెంచాలని ఒత్తిడి అక్రమ రవాణాను అడ్డుకుంటే అధికార పార్టీ నేతలు సిపార్సులు అధికం కావడంతో అధికారులు నలిగిపోతున్నారు. కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తెల్లవారు జామున ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా పనిభారంతో విశ్రాంతి లేకుండా చేస్తున్నామంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీరాజ్, ఆర్‌అండ్‌బీలో ప్లానింగ్‌లు, ప్రతిపాదనలే తప్ప అభివృద్ధి పనులు మాత్రం కానరావడంలేదు. ఏడాదిగా సమీక్షలు, సమావేశాలకు పరిమితం అవుతున్నారు గాని పనులు మాత్రం కార్యారూపం దాల్చడం లేదు.

బెదిరింపులతో భయపడిపోతున్నారు

కుప్పానికి బయట ప్రాంతాల నుంచి అధికారులు రావాలంటే భయపడుతున్నారు. అధిక పనిభారం, ఒత్తిళ్లు , బెదిరింపులు అధికంగా ఉంటాయని అధికారుల వాదన. నెల రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది బదిలీలు నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో అక్కడికక్కడే సర్దుబాటు చేశారు. బయట ప్రాంతాల నుంచి ఎవ్వరూ రాలేదు. రెండు , మూడు సచివాలయాలకు ఒక్కరే కార్యదర్శులు, వీఆర్‌ఓలు ఇన్‌చార్జులుగా పనిచేస్తున్నారు. కుప్పం ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండి 5 నెలలు గడుస్తున్నా, భర్తీ కాలేదు. కుప్పం ఎంఈఓ సైతం ఇన్‌చార్జి పోస్టుకే పరిమితం అయింది.

చేయలేక.. ఉండలేక..

అధికార పార్టీ నేతలు మాటలు వినకపోతే బదిలీ ఉండదు.. నేరుగా సస్పెన్షకు బలి కావాల్సిందే. గతంలో కుప్పం అర్బన్ సీఐగా, కుప్పం ఎంఈఓల సస్పెన్షన్ ఈ కోవకు చెందిందే. స్థానికంగా స్థిర పడిన ఉద్యోగులు బయట ప్రాంతాలకు వెళ్లలేకుండా భయపడుతూ పనిచేయాల్సిన పరిస్థితి కుప్పం నియోజకవర్గంలో నెలకొంది. ఆర్టీసీలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు సైతం రాజకీయాలకు బలైపోయారు. రోజురోజుకు అధికార పార్టీ నేతల ఆగడాలు మితిమీరి పోవడంతో కుప్పం నియోజకవర్గంలో అధికారులు పనిచేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలల కమిటీలు పటిష్టంగా పనిచేయాలి

- బాల్యవివాహాలను నిర్మూలించాలి
- స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీలు పటిష్టంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. జిల్లాలోని పలు శాఖల అధికారులతో గురువారం వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలు ప్రమాదకరమైనవన్నారు.

జిల్లాలో బాల్య వివాహాలు, కౌమారదశ గర్భధారణలు, బాల్య లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, మత్తు పదార్థాల దుర్వినియోగం వంటివి గుర్తించేందుకు ప్రత్యేక సర్వేలు నిర్వహించాలన్నారు. అత్యంత ప్రమాదకర ప్రాంతాలను మ్యాప్ చేసి ఆ ప్రాంతాలలో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బాలల సంరక్షణ కేంద్రాలు, పాఠశాలల సందర్శన, వెల్ఫేర్, విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించే వసతి పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. బాలల చట్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బంది ఏర్పాట్లు.....

ఈనెల 15న జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పోలీసు గౌరవ వందనం, కవాతు, బందోబస్తు, ట్రాఫిక్ సమస్యల అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రశంస పత్రాల విషయంలో గందరగోళంను నివారించేందుకు ముందుగానే సంబంధిత సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా వైద్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను తప్పకుండా చేపట్టాలన్నారు. సమీక్షలో డీఆర్‌వో మోహన్ కుమార్, డీఎఫ్‌వో భరణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా జీఎస్టీ వసూలు చేయండి

జిల్లాలో జీఎస్టీ పక్కాగా వసూలు చేయాలని కలెక్టర్ వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఆదేశించారు. పన్నుదారుల నుంచి జీఎస్టీ వసూలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ పన్ను పరిధిలోకి రాని సంస్థలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. డీఫాల్టర్స్ బ్యాంక్ అటాచ్‌మెంట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపుల ముందు ట్యాక్స్ డిడెక్షన్ తప్పనిసరిగా అమలు చేసి రెవెన్యూ లోటును నివారించాలన్నారు. అన్ని ప్రొఫెషనల్ సర్వీసు సంస్థలు, విద్యాసంస్థలు, ఇంజినీరింగ్, మెడికల్ ప్రొఫెషనల్స్ తప్పనిసరిగా జీఎస్టీ పరిధిలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్‌లు వార్డుల్లో పర్యటించి పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలన్నారు. స్థిరాస్తుల గుర్తింపు, బకాయిల వసూళ్ల సందర్భంలో ఆస్తులను జప్తు చేయడంలో రెవెన్యూ శాఖ అధికారులు పన్నులు ఎగవేస్తున్న నకిలీలను గుర్తించాలన్నారు. సమీక్షలో చిత్తూరు డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు కార్పొరేషన్ : వర్షాలపై అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. గురువారం చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గాలి ఎక్కువగా రాకపోవడంతో ఎక్కడ కరెంటు స్తంభాలు పడిపోవడం, లైన్ ట్రిప్పు అవడం లేద న్నారు. దీంతో శాఖా పరంగా నష్టం లేదని, వినియోగదారులకు అంతరాయం లేదన్నారు. ఏ సమయంలో సమస్య వచ్చినా వెంటనే సిబ్బంది వెళ్లి పరిష్కరించాలన్నారు. ఏఈలు పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను వారం లోపు పూర్తి చేయక పోతే రిలీవ్ చేస్తామని హెచ్చరించారు. సకాలంలో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయాలన్నారు. ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. సెక్షన్ల పరిధిలో వందశాతం విద్యుత్ బిల్లు వసూళ్లకు కృషి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేసి వినియోగదారుల చేత నమోదు చేయించాలన్నారు. ముఖ్యంగా 300 యూనిట్లకు పైగా వాడుతున్న వారికి వీటిపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈలు ఆనంద్, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

10న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్టు ఎంపిక

నగరి : ఈ నెల 10న తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మైదానం ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్స్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పి.బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు మైదానానికి చేరుకోవాలన్నారు. 2006 జనవరి 2 తరువాత జన్మించిన వారు పాల్గొనడానికి అర్హులని, సెలెక్షన్స్‌కు ఆధార్ కార్డు, బ్లడ్ గ్రూప్ వివరాలతో రావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. వీరితో పాటు సీనియర్ ఉమెన్ పోటీలకు ఎంపిక చేసిన 15 మందికి ఫైనల్ సెలెక్షన్స్ ఉంటుందన్నారు. వారు కూడా సమయానికి మైదానానికి హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7013754776 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

42 మందికి బదిలీ రీ కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న 42 మంది బయాలజీ టీచర్లకు బదిలీల రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో వరలక్ష్మి పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో బయాలజీ టీచర్లుగా పనిచేస్తున్న 42 మందికి ఒకటన్నర నెల క్రితం నిర్వహించిన బదిలీల్లో ఎన్‌సీసీ పాయింట్‌లు పొందలేక నష్టపోయారు. దీంతో గతంలో నిర్వహించిన బదిలీల్లో ఎన్‌సీసీ పాయింట్లు పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ ఆ పాయింట్లు పొందలేక బదిలీల్లో దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ సమస్యపై నష్టపోయిన బయాలజీ టీచర్లు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు వినతి చేసుకున్నారు. స్పందించిన కమిషనర్ విచారణ చేశాక బాధితులు ఫిర్యాదు చేసిన సమస్య నిజమేనని అంగీకరించి బదిలీ రీ కౌన్సెలింగ్‌కు ఆదేశించారు. దీంతో ఆ 42 మంది బయాలజీ టీచర్లకు జిల్లా విద్యాశాఖ అధికారులు రీ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్లు కల్పించారు. కార్యక్రమంలో ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్, సూపరింటెండెంట్లు రవిశేఖర్ పాల్గొన్నారు.

పాల కూట విషం

ఆకుపచ్చని రంగులో కాలకూటాన్ని తలపించేలా డెయిరీ నుంచి వస్తున్న వ్యర్థ జలాలు.. అందులో కరిగి మిళితమైన అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు.. అవి భూమిలో ఇంకి కలుషితమవుతున్న భూగర్భజలాలు.. ఆ వ్యర్థ జలాల నిల్వల్లో వృద్ధి చెందుతున్న దోమలు.. ఆ నీటి నుంచి వస్తున్న దుర్వాసనతో ఆ ప్రాంతంలోని నివాసితులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత్యంతరం లేక ఆ పాల కూట విషం తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు.


మదర్ డెయిరీ ప్రాంగణంలో వదిలేసిన వ్యర్థ జలాలు

- డెయిరీ ప్రాంగణంలో వదిలేస్తున్న ప్రమాదకర వ్యర్థ జలాలు
- భూగర్భంలోకి ఇంకుతుండడంతో జలకాలుష్యం
- నోటీసులిచ్చినా మారని యాజమాన్యం తీరు

తిరుపతి రూరల్ : గాంధీపురంలోని డెయిరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదిలేస్తుండడంతో సమీపంలో నివసించే జనం కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిలాడుతున్నారు. ఫ్యాక్టరీకి చుట్టూ నివాసముంటున్న వారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. వ్యర్థ జలాలను వదలకూడదని పలుసార్లు అధికారులు హెచ్చరికలు జారీ చేసినా.. నోటీసులు ఇచ్చినా ఆ డెయిరీ యాజమాన్యంలో మాత్రం మార్పు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కాలుష్య నియంత్రమండలి అధికారులైనా స్పందించాలని స్థానికంగా నివాసముంటున్న ప్రజలు కోరుతున్నారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న మదర్ డెయిరీ నుంచి వచ్చే వ్యర్థాలతో కూడిన మురుగునీరు ప్రహరీ గోడ పగిలిన ప్రాంతంలో బయటకు వస్తుండడంతో పలుసార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆ ప్రహరీ నుంచి వెలుపలకు వ్యర్థ జలాలు రాకుండా డెయిరీ లోపల రాళ్లు, మట్టితో నింపేసింది. కొద్దిరోజుల పాటు డెయిరీ ప్రాంగణంలో కూ డా వ్యర్థ జలాలు వదలకుండా ఉండేది. ఇటీవల వర్షాలు వచ్చినప్పటి నుంచి మళ్లీ డెయిరీ ప్రాంగణంలోనే వ్యర్థ జలాలను వదిలేస్తోంది. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు దుర్వాసన భరించలేకపోతున్నారు. మరోవైపు ఆ వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకడంతో బోర్లలో నీరు రంగు మారిపోయింది. అంతేకాక రాత్రివేళ దోమల బెడద కూడా ఎక్కువగా ఉండడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదర్ డెయిరీ నుంచి వచ్చే వ్యర్థజలాలకు అడ్డుకట్ట వేయకుంటే భూగర్భ జలాలు కలుషితమై సమీప గ్రామాల్లోని ప్రజలను అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పలువురు పర్యావరణ పరిరక్షకులు హెచ్చరిస్తున్నారు.


వ్యర్థ జలాలు బయటకు వెళ్లకుండా నిర్వాహకులు ప్రహరీ లోపల వేసిన రాళ్లు

పర్యావరణానికి పెనుముప్పు

డెయిరీ వ్యర్థ జలాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి గాలి, భూగర్భ జలాలు, నేలను కూడా కలుషితం చేస్తాయని చెబుతున్నారు. పరిశ్రమల్లో శుభ్రపరిచే ప్రక్రియల నుంచి వచ్చే రసాయనాలు, అధిక మొత్తంలో నూనెలు, గ్రీజులను కూడా కలిగి ఉండడంతో జీవఅధోకరణం చెంది ఆక్సిజన్ స్థాయిని తగ్గిస్తాయంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు దీనిపై స్పందించి డెయిరీ ప్రాంగణంలో పరిశీలించి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలుషితం..వ్యాధుల భయం

డెయిరీ నుంచి వెలువడే వ్యర్థనీరు భూమిలోకి ఇంకిపోతోంది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. చుట్టుపక్కల బోరుబావుల్లో తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీటినే తాగడం, స్నానాలు చేయడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

నోటీసులిచ్చినా స్పందన ఏదీ..?

గతంలో బాలాజీ డెయిరీగా, ఆ తరువాత శ్రీజ డెయిరీగా, ఇప్పుడు మదర్ డెయిరీగా పాల పదార్థాల తయారీని కొనసాగిస్తున్న డెయిరీ నుంచి వ్యర్థాలు బయటకు వచ్చినపుడల్లా పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా సరే ఫ్యాక్టరీ యాజమాన్యానికి చీమకుట్టినట్టు కూడా అనిపించడం లేదనే వాదనలు అధికారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మురుగునీరు బయటకు వస్తుండడంతో ఎంపీడీఓ రామచంద్ర దృష్టికి తీసుకువెళ్లగా స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా ఫ్యాక్టరీ నిర్వాహకులకు నోటీసు ఇచ్చారు. అలాగే కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం అందించి, ఆ ఫ్యాక్టరీని పరిశీలించాలని లేఖ రాశారు. వ్యర్థ జలాలను డెయిరీ ప్రాంగణం నుంచి బయటకు రావడం లేదు కదా అని యాజమాన్యం ధీమాగా ఉంటోంది.

బోయకొండ.. జన దండు


ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో గురువారం పోటెత్తింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ ఆశీర్వదించమ్మా అంటూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ మాసంతో పాటు వరలక్ష్మీవ్రత పూజలను పుర స్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, జంతు సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల రైతులు అమ్మవారికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పకడ్బందీగా జిల్లా జట్ల ఎంపిక



జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన హాకీ క్రీడాకారుల జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జట్ల ఎంపిక పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో వివిధ క్రీడలకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో తిరుపతిలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలుగా ఎంపికయ్యే వారికి ఈనెల 29న పతకాలను ప్రదానం చేస్తారని తెలిపారు.

పాఠశాలను కూల్చి.. ఆర్వో ప్లాంటు ఏర్పాటు


ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


పాఠశాల గోడను పగులకొట్టిన దృశ్యం

విజయపురం : స్థానిక టీడీపీ నాయకులు పాఠశాలను కూల్చేసి ఆర్వో ప్లాంట్ పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. విజయపురం మండలం మల్లారెడ్డి కండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెండు తరగతి గదులు ఉన్నాయి. ఒక గదిలో విద్యార్థులు చదువుకుంటుండగా మరో గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే కొందరు టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రాన్ని మూయించేసి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు కోసం గోడలను పగులు కొట్టి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. స్థానిక హెచ్‌ఎం, ఎంఈవో సైతం ఎంత చెప్పినా వినకుండా వారిని బెదిరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సైతం ఇవేవీ పట్టించుకోకుండా ఆర్వో ప్లాంటు ప్రారంభించడం ఏమిటని విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు




పూజల్లో పాల్గొని టెంకాయలు కొట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు, బుటకపల్లె అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సదుం: అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విడుదల కావాలని కోరుతూ బూరగమంద శాసనమ్మ ఆలయం, మత్తుకువారిపల్లె మల్లీశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పూజలు చేశారు. 101 టెంకాయలను కొట్టారు. జిల్లాలో క్రియాశీలకంగా ఉన్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని కేసులతో వేధిస్తే తమకు అడ్డు ఉండదని కూటమి నేతలు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, అక్రమ కేసులకు పెద్దిరెడ్డి కుటుంబం భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రజా సమస్యలపై మరింతగా పోరాడుతారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గణేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చౌడేపల్లె షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: అక్రమ కేసులో కుట్రపూరితంగా రాజంపేట ఎంపీ పీవీ. మిథున్‌రెడ్డిని జైలుకు పంపారని, ఆయన విడుదల కావాలని కోరుతూ గురువారం బుటపల్లె సమీపంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, చౌడేపల్లెలోని సాయిబాబా ఆలయంలో గడ్డవారిపల్లెకు చెందిన గిరిబాబు ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేసి, అన్నదానం చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, చెంగారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్. దామోదరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, రమేష్‌బాబు, సర్పంచ్ షంషీర్, కో–ఆప్షన్ మెంబరు సాదిక్‌బాషా, మండల పార్టీ ఉపాధ్యక్షులు వెంకటరమణ, అమర, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అనుప్రియ, నాయకులు మునికృష్ణమ నాయుడు, నారాయణరెడ్డి, గిరిబాబు, కృష్ణంరాజు, బ్రహ్మానందరెడ్డి, వినోద్‌రెడ్డి, అల్తాఫ్, సనావుల్లా, సుబ్రమణ్యం, పవన్, భాస్కర్, రెడ్డెప్పరెడ్డి, విజయ్, హరిబాబు,గంగాధర్, బాబాజాన్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుల సంతకాల సేకరణ ఉద్యమం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తోతాపురికి కేజీ రూ.12..వెంటనే రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయాలని సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు రైతు నాయకులు సుకుమార్, సుధా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటించిన రూ.12 చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో 13వ తేదీన చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా నిర్వహిస్తామని, దీంతో పాటు సంతకాల సేకరణ ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు.

బాలికతో పెళ్లి ఘటనపై నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిత్తూరు అర్బన్ : బాలికను పెళ్లి చేసుకుని, ఆపై కాపురం పెట్టినందుకు గాను లోకేష్ అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు చిత్తూరులోని పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.శంకరరావు గురువారం తీర్పు నిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కథనం మేరకు వివరాలిలా.. ఓ పట్టణానికి చెందిన 14 ఏళ్ల బాలిక కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు 2022 ఫిబ్రవరిలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వెదురుకుప్పం చెందిన లోకేష్ అనే నిందితుడు బాలికను పెళ్లి చేసుకొని పలుమార్లు శారీరకంగా కలిసినట్లు గుర్తించారు. బాలికను లోకేష్ నుంచి విడిపించిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.9500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కాలువలో పడిన లారీ.. తప్పిన ప్రమాదం


క్రేన్ సాయంతో లారీని బయటకు తీస్తున్న దృశ్యం

చిత్తూరు అర్బన్ : రెండు రోజులుగా నగరంలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వైజాగ్ నుంచి సబ్బులు, షాంపులు ఇతర వస్తువుల లోడ్‌ను వి.కోటకు చెందిన డ్రైవర్ నారాయణస్వామి బుధవారం చిత్తూరుకు తీసుకొచ్చాడు. లారీని కట్టమంచి చెరువు ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేశాడు. గురువారం ఉదయం లారీని స్టార్ట్ చేసి, ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో లారీ బోల్తా పడిపోయింది. ప్రమాదంలో చిన్న పాటి గాయం కూడా తగలకుండా అదృష్టవశాత్తు నారాయణస్వామి బయటపడ్డాడు. లారీ పాక్షికంగా ధ్వంసమయ్యింది. అనంతరం క్రేన్ల సాయంతో లారీని కాలువ నుంచి బయటకు తీశారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

చేయూతనిస్తే మరింత అభివృద్ధి

చౌడేపల్లె : ప్రభుత్వం చేయూతనిస్తే మరింత అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలుస్తామని డీఆర్‌డీఏ పీడీలు శ్రీదేవి, శ్రీనివాసులను కోరారు. గురువారం ఖాన్‌సాబ్‌మిట్ట, చారాలలో చేతివృత్తులతో జీవనోపాధి పొందుతున్న వారి కేంద్రాలను సందర్శించారు. చారాలలో వెండి, పంచలోహ విగ్రహాల తయారీని పరిశీలించారు. అలాగే ఖాన్‌సాబ్‌మిట్టలో సుమారు 70 కుటుంబాల వారు బిస్కెట్ల తయారీనే జీవనాధారం. గత ప్రభుత్వంలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఇచ్చిన రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారో తెలుసుకునేందుకు విజయనగరం జిల్లా పీడీ శ్రీనివాసులు హాజరై లబ్ధిదారులతో వివరాలు తెలుసుకున్నారు. ఆదర్శంగా జీవనోపాధులు పెంపొందించుకొని రాణిస్తున్న మహిళలను అభినందించారు. మరింతగా ప్రోత్సహించి రుణాలిస్తే అన్ని రంగాల్లో ఆదర్శంగా రాణిస్తామని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆదుకొంటామని పీడీ పేర్కొన్నారు. అనంతరం బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. ఆమె వెంట ఏపీఎం సుబ్రమణ్యం, సీసీ నాగరత్న, శ్రీనివాసులు, వీఓఏ రెడ్డెప్ప ఉన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

తిరుపతి లీగల్ : రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు తిరుపతిలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ గురువారం మీడియాకు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి తిరుపతిలో ప్రతి కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిటింగ్‌లను నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆయా కోర్టుల న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కేసులను రాజీ చేస్తారని తెలిపారు.

వివాహిత బలవన్మరణం


కౌసల్య మృతదేహం

నింద్ర : మండలంలోని పాదిరి దళితవాడకు చెందిన వివాహిత కౌసల్య బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. నింద్ర మండలం పాదరి దళితవాడకు చెందిన దొరైరాజ్, మలర్ దంపతుల పెద్ద కుమారుడు చార్లెస్‌తో నగరి దళితవాడకు చెందిన రీటా కుమార్తెతో 2021లో ప్రేమ వివాహం జరిపించారు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. తరువాత కౌసల్య భర్త చార్లెస్ మరో మహిళతో వివాహేతర సంబంధం అనుమానంతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో బుధవారం గొడవలు జరగడంతో మనస్తాపానికి గురై కౌసల్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని కౌసల్య తల్లి రీటా నింద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె మృతికి చార్లెస్, దొరైరాజ్, మలర్ కారణమని వారిపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఇద్దరి పిల్లలను తమకు అప్పగించాలని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మహేష్ తెలిపారు.

పంటలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. గురువారం తెల్లవారుజామున పాళెం సమీపం చింతలవంకలో తిష్ఠ వేసిన 16 ఏనుగుల గుంపు బాలిరెడ్డిగారిపల్లె, గండోలపల్లె, దిగువమూర్తివారిపల్లె, దేశిరెడ్డిగారిపల్లె ప్రాంతాలలోని అరటి, మామిడి, కొబ్బరి, వరి పంటలను నాశనం చేశాయి.దీనితో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.




ఏనుగులు నాశనం చేసిన అరటి పంట, తొక్కేసిన వరిపైరు